ఫిష్ ఆంధ్ర.. అదుర్స్

- పెడన నియోజకవర్గంలో 24 ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లు
- రూ.30 లక్షలతో మూడు డైలీ యూనిట్లు..ఒక్కోదానికి రూ.10లక్షలు
- బంటుమిల్లి, కృత్తివెన్నులో డైలీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు
- లైవ్ ఫిష్.. తాజా ఫిష్‌ల విక్రయాలతో పచ్చళ్లు కూడా అమ్మకాలు

కష్టపడి వేటాడిన మత్స్యసంపదకు చక్కని మార్కెట్ లభించడంతో గంగపుత్రులు ఆనందించే సందర్భం.. 'ఫిష్ ఆంధ్ర'. పెడన నియోజకవర్గంలో ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్ల దుకాణాలను ఏర్పాటు చేయడంతో చేపలను విక్రయిస్తున్నారు. సూపర్ షాపులు, డైలీ యూనిట్లలో లైవ్ ఫిష్‌లు, తాజా చేపలు, ఉప్పుకారం పెట్టిన చేపల ముక్కలు(రెడీ టు కుక్), పచ్చళ్లు విక్రయిస్తుండగా బంటుమిల్లి, కృత్తివెన్నుల్లో డైలీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.



పెడనలో ఫిష్ ఆంధ్ర మిని ఔట్‌లెట్(దుకాణం) (ఫైల్)

పెడన: మత్స్యకారులకు అండగా ఉంటూ మత్స్య సంపదను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంది. దీంతో వేలాదిమంది మత్స్యకారుల తలరాత మారుతోంది. అంతేకాకుండా ఆహారంలో కీలక పోషకాలు ఉన్న చేపల ఉత్పత్తికి, అమ్మకాలకు మరిన్ని మంచి రోజులొస్తున్నాయి. ఫిష్ ఆంధ్ర నినాదంతో ఇప్పటికే మినీ ఔట్‌లెట్లు(దుకాణాలు) ఏర్పాటు చేసింది. అదనపు హంగులతో చేపల షాపులను అందుబాటులోకి తెచ్చింది. నియోజకవర్గంలో సముద్రతీరం 24 కిలోమీటర్లు ఉండగా ఫిష్‌ల్యాండ్ గ్రామాలు నాలుగు, మెరైన్ గ్రామాలు 12 ఉన్నాయి. మత్స్యకార జనాభా 11,459 మంది ఉంటే వీరిలో 5,682 వేటకు వెళ్లే వారున్నారు. 6,891 మందికి మత్స్యకార గుర్తింపు కార్డులు జారీ చేశారు. 255 పడవలున్నాయి. ప్రభుత్వ చర్యలతో చేపల వేటపై ఆధారపడిన వీరికి మేలు చేకూరుతోంది. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

24 ఫిష్ ఆంధ్ర మిని ఔట్‌లెట్లు.. రెండు డైలీ యూనిట్లు

పెడన నియోజకవర్గంలో 24 మినీఔట్‌లెట్ల(దుకాణాలు)ను ఏర్పాటు చేసి వీటిల్లో సముద్రంలో, రిజర్వాయర్లు, చెరువులు, నదులలో లభ్యమయ్యే చేపలకు చక్కటి మార్కెటింగ్‌కు అవకాశం కల్పించారు. పెడనలో మూడు, కృత్తివెన్నులో 13, బంటుమిల్లిలో 8 ఉన్నాయి. డైలీ యూనిట్లు విషయానికి వస్తే బంటుమిల్లిలో ఒకటి కృత్తివెన్ను మండలంలో కృత్తివెన్ను, లక్ష్మీపురంలో రెండు ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టారు. ఈ డైలీ యూనిట్లు ఒక్కొదానికి రూ.10లక్షలు వెచ్చించనున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించి లబ్ధిదారులను గుర్తించి తద్వారా ఆయా డైలీ యూనిట్లను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రాసెసింగ్‌లో డైలీ యూనిట్లు



డైలీ యూనిట్లు ప్రాసెసింగ్‌లో ఉన్నాయి మత్స్య ప్రియులు గతంతో పోల్చితే ప్రస్తుతం బాగా పెరిగారు. ప్రస్తుతం మార్కెటింగ్ అవకాశాలు మెరుగు పడటమే కాకుండా మత్స్యసంపద బాగా చేరువయ్యాయి. ఫిష్ మినీ ఆంధ్రలకు తోడు మరో మూడు డైలీ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. కృత్తివెన్నులో రెండు, బంటుమిల్లిలో ఒకటి ప్రాసెసింగ్‌లో ఉన్నాయి.

–సీహెచ్ నాగబాబు, సహాయ సంచాకులు, మత్స్యశాఖ, బంటుమిల్లి

క్లుప్తంగా

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పెడన పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం కౌన్సిల్ మీటింగ్ హాల్లో జరిగే సమావేశంలో రానున్న వర్షాకాలంలో పారిశుద్ధ్యం, సిల్ట్ తొలగింపు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరుకావాల్సిందిగా సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ సమకూర్చిన వస్తు సామగ్రి కిట్లను మంగళవారం అందజేశారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మోపిదేవి సబ్‌బ్రాంచ్ ప్రతినిధులు వస్తు సామగ్రి, కూరగాయలు, టార్పాలిన్ పట్టా, బియ్యం బాధిత కుటుంబాలకు అందించారు. అధ్యక్షుడు యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కందుల సీతారామయ్య, సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, వీఆర్వోలు నీల్‌కాంత్, జీవీ రమణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చడానికే..



మోపిదేవి: వేసవిలో భక్తులతో పాటు బాటసారుల దాహార్తిని మజ్జిగ తీరుస్తుందని ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో మండల ప్రెస్‌క్లబ్, ఎస్‌ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం మూడో రోజు మంగళవారం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో యువతకు క్రికెట్ కిట్లను పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. కాసానగర్ లెజెండ్స్ జట్టుకు, పెదప్రోలు తూర్పు బజారులోని యువకులకు క్రికెట్ కిట్లు అందించారు. విక్కుర్తి మాట్లాడుతూ యువకులకు క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించడానికి కిట్లు అందించినట్లు తెలిపారు. గ్రామంలో కొన్ని సమస్యలు తమ దృష్టికి తెచ్చారని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నాదెళ్ల శరశ్చంద్రబాబు, మాజీ సర్పంచ్ మద్దిపట్ల జగన్ మోహన్‌రావు, నాదెళ్ల వెంకట్రామయ్య, విక్కుర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతి ఉత్సవాలు నగరంలోని పలు ఆలయాల వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. నగరంలోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో మంగళవారం నుంచి జూన్ 1వ తేదీ శనివారం వరకు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. నగరంలోని బచ్చుపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉదయం సిందూరార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. కవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ హనుమత్‌తత్వం అనే అంశంపై ప్రసంగించారు. టీటీడీ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో గరుడ సేవా సమితి సభ్యులు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమాలను టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు. 29, 30, 31 తేదీల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షిప్తం

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నున్న(విజయవాడరూరల్): రుతు పరిశుభ్రతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ విజయవాడ రూరల్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి సూచించారు. నున్న గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం – 3లో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ.. పీరియడ్ టైమ్‌లో ఆడపిల్లలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారం, తినకూడని ఆహారం తదితర విషయాలను వివరించారు. సా స్వచ్ఛందసేవా సంస్థ మేనేజర్ రీతా మాట్లాడుతూ శానిటరీ న్యాప్కిన్స్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సామాజిక కార్యకర్త వి.శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన, రుచికరమైన వంటల తయారీపై వంట ఏజెన్సీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేపట్టిందని తెలిపారు. వంట ఏజెన్సీలు తప్పనిసారిగా మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. వంటల తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతోనే చదువుపై శ్రద్ధ చూపిస్తారని తెలిపారు. ఎంఈఓ–2 కమల, పలువురు సీఆర్పీలు, 54 పాఠశాలలకు చెందిన వంట ఏజెన్సీలు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పంటకు రక్ష

పామర్రు: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. పామర్రులో 1,200 మట్టి నమూనాలను లక్ష్యంగా నిర్ణయించి, రైతులకు తెలియజేయనున్నారు. భూమిలో చౌడు, ఆమ్ల గుణాల స్థాయిని నిర్ధారించి, సంబంధిత భూముల్లో సాగు చేయబోయే పంటలకు ఏయే ఎరువులు వినియోగించాలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేస్తారు. తద్వారా భూసారాన్ని పెంచవచ్చు. నేలలో ఉండే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యతను తెలుసుకునేందుకు మట్టి నమూనా పరీక్షలను నిర్వహించాలని మచిలీపట్నం జిల్లా ట్రైనింగ్ సెంటర్ అధికారులు తెలిపారు. మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలి, నమూనాల ప్రాముఖ్యతల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత రైతులకు ఎంతైనా ఉంది. నమూనాల పరీక్షలను ఏ విధంగా చేయాలని అనే అంశాలను అధికారులు వివరిస్తారు. మట్టి నమూనాలను పొలాల్లో ర్యాండమ్‌గా 10–15 ప్రదేశాల్లో సేకరించాలి. ఒక్కొక్క ప్రదేశం నుంచి అరకేజీ చొప్పున మట్టిని సేకరించాలని, బాపట్లలోని ఆర్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు పంపి వచ్చిన ఫలితాలను రైతులకు తెలియజేస్తారు. వీటి ఆధారంగా వరి సాగులో ఏ ఎరువులు పురుగుమందులు వాడలో తెలియజేస్తారు. వరి పొలాల్లో 15 సెంటీమీటర్ల లోతులో 'వీ' ఆకారంలో గొయ్యి తీసి మట్టి నమూనా సేకరించాలని అధికారులు తెలిపారు.



క్రీడలతో మానసిక ఉల్లాసం


తెన్నేరులో లెమన్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

కంకిపాడు: క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్. సునీత తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్‌లలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి గల రంగాలను ఎంచుకుని నైపుణ్యం ప్రదర్శించాలని సూచించారు.

పేదలకు అన్నసమారాధన


అన్నసమారాధన చేస్తున్న సంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పేదలకు అన్నసమారాధన జరిగినట్లు సేవా సంస్థ పట్టణ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. స్థానిక సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సలహా మండలి సభ్యురాలు నందమూరి పద్మజ సహకారంతో అన్నసమారాధన చేసినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ పీవీ శేషగిరిరావు, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, ఎ.గోపిరెడ్డి, దండమూడి సీతారామస్వామి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామివార్ల గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం సోమవారం జరుగగా మంగళవారం ఉదయం నిత్య హోమం చేపట్టారు. సంతానప్రాప్తి కోసం పుత్రకామేష్టి యాగం చేశారు. మధ్యాహ్నం స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి, మేళతాళాలతో గ్రామంలో స్వామివార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ, రాత్రి సామూహిక రమా సహిత సత్యదేవ వ్రతం, మంత్రపుష్పం తీర్థగోష్టి చేసి భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

పంట నష్టపరిహారం పంపిణీపై విచారణ చేయాలి

పెడన: మిచాంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం పంపిణీ అక్రమార్కులకు వరంగా మారిందని, దీనిపై పూర్తి విచారణ చేసి అసలైన రైతులకు న్యాయం చేయాలని పెడన ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్‌కు రైతులు, కాంగ్రెస్ నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిచాంగ్ నష్టపరిహారాన్ని ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖలోని కొందరు.. అనర్హులైన వారిని రైతులుగా చూపించి వారి ఖాతాలకు నగదు జమ చేయించి తిరిగి తీసుకుంటున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యాచకులకు భోజన వసతి

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మందపాడులోని యాచక నివాస కేంద్రంలో మంగళవారం భోజన వసతి కల్పించినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంజీవీ ఆంజనేయులు వితరణతో కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో సంచరిస్తూ యాచించే యాచకుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో తమ వంతు సహకారంగా మంగళవారం భోజనవసతి కల్పించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, ఎం. రామకృష్ణ, పి. సత్యనారాయణ, డి. శ్రీనివాసరావు, సీహెచ్. రామకృష్ణ, బొగ్గారపు తిరుపతయ్య, కొనకళ్ల సీతయ్య పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు నివాళి


వీర సావర్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు వీర సావర్కర్ జయంతి సందర్భంగా నేతాజీ మిత్ర మండలి సభ్యులు మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, బుల్లెట్ ధర్మారావు, జీఎస్‌ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సమావేశం

మండవల్లి: మాసిక మహోత్సవంలో భాగంగా మండవల్లిలో కిశోర బాలికల సమావేశం మంగళవారం నిర్వహించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పిరియడ్స్ సమయంలో తీసుకోవాల్సిన వ్యక్తిగత శుభ్రత, గుడ్ టాక్, బ్యాడ్ టాక్ గురించి సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి వివరించారు. కిశోర బాలికలతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, సుధారాణి, ఉమాదేవి, శ్రీదేవి, నాగలక్ష్మి, జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి బిస్కెట్లు సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వనపర్తిజిల్లా ఆత్మకూరు మండలం రేచింతల గ్రామ వాస్తవ్యులు మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులు 2 కిలోల 700 గ్రాముల వెండి బిస్కట్లు మంగళవారం సమర్పించుకున్నారు. తొలుత స్వామివార్లను దర్శించుకున్న అనంతరం సుమారు రూ. 2.50 లక్షల విలువైన ఈ వెండి బిస్కట్లను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుకింగ్ ఏజెన్సీలకు శిక్షణ


వంటలను పరిశీలిస్తున్న జిల్లా డైరెక్టర్ మనోహర్ నాయక్, ఎంఈవోలు

కృత్తివెన్ను: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కుకింగ్ కం హెల్పర్స్ (సీసీహెచ్) లకు మండల స్థాయిలో ఒకరోజు శిక్షణ తరగతులను సంగమూడి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించినట్లు ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని దీనికనుగుణంగా ఏజెన్సీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం వంటల పోటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎండీఎం అడిషనల్ జిల్లా డైరెక్టర్ మనోహర్ నాయక్, ఎండీఎం సెక్టరల్ ఆఫీసర్ ఎంఎల్ నరసింహారావు సందర్శించారు. శిక్షకురాలు రాజకుమారి, సంగమూడి, మాట్లాం హెచ్‌ఎంలు పద్మజారాణి, శివకుమారి, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


పుస్తక పఠనంలో విద్యార్థులు

గూడూరు: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం యోగాసనాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాసనాల వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం వల్ల చదువుల్లో మరింత రాణిస్తారని తెలిపారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: వేసవిలో విద్యార్థులకు విజ్ఞాన శిక్షణ కార్యక్రమం ప్రయోజనకారిగా నిలుస్తోందని లైబ్రేరియన్ గణేష్‌కుమార్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ పురస్కరించుకుని పుస్తక పఠనం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. సృజనాత్మకత పెంచే అంశాలు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించండి


మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త ప్రకాష్

మచిలీపట్నంటౌన్: రాబోయే నూతన ప్రభుత్వం విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా అందించాలని సామాజిక కార్యకర్త ఆలపాటి ప్రకాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు పలు రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నాయని వీటితో ప్రజల ఆర్థిక స్థితిగతులు పూర్తిస్థాయిలో మారటం లేదన్నారు. ఈ పథకాలకు వినియోగిస్తున్న సొమ్మును విద్య, వైద్యానికి కేటాయించి పూర్తిగా ఉచితం చేస్తే పేదలకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు పరిమితి ఉన్నా రోగికి అవసరమైన పలు పరీక్షలు, నాణ్యమైన పరికరాలు అమరుస్తామంటూ ప్రైవేటు ఆసుపత్రుల వారు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయరన్నారు. దీంతో పేద రోగులు అప్పులు చేసి మంచి వైద్యం కోసం ఆస్పత్రులకు చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం పాఠశాలలకే కాకుండా ప్రైవేటు పాఠశాలలో విద్యను ఉచితంగా అందించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అప్పుడు పేద వర్గాల ప్రజలు వారి పిల్లలకు మంచి విద్యను అందించగలుగుతారన్నారు. విద్యుత్‌చార్జీలు, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని రాబోవు ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఎన్‌కౌంటర్ పత్రిక ఎడిటర్ పింగళి దశరథరామ్ స్ఫూర్తితో తాను ఈ అంశంపై ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అంబటి కాంతారావు, మాజీ కౌన్సిలర్ చలమలశెట్టి శ్రీకృష్ణ, బీజేపీ నాయకుడు పుప్పాల రామాంజనేయులు, సిరికృష్ణ థియేటర్ అధినేత వేమూరి బాలరత్నం, నాయకులు గోళ్ల రవిచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా

కంకిపాడు: ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాలతో గన్నవరం డీఎస్పీ జయసూర్య దిశానిర్దేశత్వంతో ఈడుపుగల్లు బీసీ కాలనీలో మంగళవారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ అంతటా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నివాసితుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా వస్తువులు ఏవైనా ఉన్నాయా? అని తనిఖీలు జరిపారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కొత్త వ్యక్తులకు ఇళ్లల్లో చోటివ్వకూడదని స్పష్టం చేశారు. తనిఖీల్లో పెనమలూరు సీఐ టీవీవీ రామారావు, కంకిపాడు ఎస్‌ఐ డి.సందీప్, అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు, పెనమలూరు ఎస్‌ఐలు యేసోబు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.